# హస్తం పార్టీకి ఓటేస్తే అధోగతే

- బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తేనే ప్రగతి
- ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటేయండి
- పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి
- నిమ్మపల్లిలో ముమ్మర ప్రచారం



నిమ్మపల్లిలో దాసరిపై పూలు జల్లుతూ స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పెద్దపల్లి రూరల్, నవంబర్ 3: కాంగ్రెస్‌కు ఓటేస్తే అధోగతేనని పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ తొమ్మిదేండ్లపాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని చెప్పారు. ప్రతిపల్లె అభివృద్ధి పథంలో పయనిస్తున్నదని, ప్రగతి కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దపల్లి మండలం నిమ్మపల్లిలో దాసరి మనోహర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. నుదుట తిలకందిద్ది ఆశీర్వదించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. పొరపాటున హస్తం గుర్తుకు ఓటేస్తే మన బతుకుల్లో చీకట్లు అలుముకుంటాయని హెచ్చరించారు. ప్రజలు ఆలోచించాలని తెలంగాణ వచ్చిన తర్వాత జరిగిన అభివబుద్ధిని బేరిజు వేసుకొని పనిచేసిన వారికే పట్టంగట్టాలని కోరారు.

### సొంతగూటికి రామస్వామి

పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన కారంగుల రామస్వామి తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఆయన 24 గంటలు తిరగక ముందే బీఆర్‌ఎస్‌లోకి వచ్చారు. రామస్వామికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.

# కాంగ్రెస్‌ది మోసం.. బీఆర్‌ఎస్‌ది సంక్షేమం



రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి చందర్‌కు అంతర్గాంలో డప్పుచప్పుళ్లతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

- హస్తంపార్టీకి ఓటేస్తే మన బతుకులు ఆగమే
- కేసీఆర్ పాలనలోనే ప్రజల జీవితాల్లో వెలుగులు
- రామగుండం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్
- అంతర్గాం మండలంలో ప్రజాఅంకిత యాత్ర

అంతర్గాం, నవంబర్ 3: 'అరవై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదు.. ఆ పార్టీది అంతా మోసపు చరిత్రే..వారికి ఓటేస్తే మన బతుకులు ఆగమవుతాయి' అంటూ రామగుండం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ విరుచుకుపడ్డారు. హస్తంపార్టీని గెలిపిస్తే మన కంటిని మనం పొడుచుకున్నట్టేనని వ్యాఖ్యానించారు. కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయని చెప్పారు. హనుమంతుడి గుడి లేని ఊరులేదు..కేసీఆర్ పథకం అందని ఇల్లులేదంటే అతిశయోక్తికాదన్నారు. శుక్రవారం టీటీఎస్ అంతర్గాం, విలేజ్ అంతర్గాంలో కోరుకంటి ప్రజా అంకితయాత్రలో భాగంగా ముమ్మర ప్రచారం చేశారు. ఆయాచోట్ల ఆయనకు మహిళలు మంగళహారతులిచ్చారు. గ్రామస్తులు నెత్తిన పూలవర్షం కురిపించి, డప్పుచప్పుళ్లతో సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు మూతపడడానికి కారణం కాంగ్రెస్సేనని ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే అన్నివర్గాలకు మేలు జరిగిందని చెప్పారు. బీఆర్‌ఎస్ అధినేత మానవీయ కోణంలో పార్టీ మ్యానిఫెస్టోను రూపొందించారని చెప్పారు. మళ్లీ గెలిపిస్తే రైతుబంధు, ఆసరా పింఛన్ల పెంపు, రూ. 400లకే గ్యాస్ సిలిండర్, రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం, పేద మహిళలకు ప్రతినెలా రూ. 3వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ఆలోచించాలని..ఈ ప్రగతి కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో అంతర్గాం ఎంపీపీ దుర్గం విజయ, జడ్పీటీసీ అముల నారాయణ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మీ మహేందర్ రెడ్డి, సర్పంచ్‌లు కఠ్ర వెంటకమ్మ నూకరాజు, తుంగపిండి సతీశ్, ధరని రాజేశ్, ధర్మాజీ కృష్ణ, బాదరవేని స్వామి, గంగాధరి దేమమ్మ, రాములు, మెరుగు పోశం, కో ఆప్షన్ సభ్యులు దివాకర్, గౌస్‌పాషా, నాయకులు తిరుపతి నాయక్, కోల సంతోష్‌గౌడ్, ఆర్శనపల్లి శ్రీనివాస్, ఎదులపూరం వెంకటేశ్, మల్లయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గెలిపిస్తే రుణం తీర్చుకుంటా

- ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటా
- కాంగ్రెస్‌ను నమ్మి కష్టాలు తెచ్చుకోవద్దు
- కారుకు ఓటేస్తే మరింత ప్రగతి
- మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్
- పట్టణంలో ముమ్మర ప్రచారం



మంథని పట్టణంలోని రావుల చెరువుకట్టలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

మంథని, నవంబర్ 3: 'సామాన్యుడినైనా తాను మీరిచ్చిన ఆశీర్వాదంతోనే ఇంతటి స్థాయికి ఎదిగిన..మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి మీ రుణం తీర్చుకుంటా.'అని మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ ప్రకటించారు. శుక్రవారం మంథనిలోని పోచమ్మవాడ, మహాలక్ష్మి టెంపుల్ ఏరియా, రావుల చెరువుకట్ట, భగత్‌నగర్, ఉస్మాన్‌పుర, సుభాష్‌నగర్, మర్రివాడ, అంబేద్కర్‌నగర్, ముత్యాలమ్మ వీధుల్లో బల్దియా చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి ముమ్మర ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలుకరిస్తూ కాలనీల్లో కలియదిరిగారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలు తప్పవన్నారు. కర్ణాటక ప్రజలు ఆ పార్టీని గెలిపించి కరెంట్‌రాక, సాగునీరులేక అనేక ఇక్కట్లు పడుతున్నారని గుర్తుచేశారు. మంథనిలో 55 ఏండ్లు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ ప్రజల బాగోగులను పట్టించుకోలేదని విమర్శించారు. పదవులను అనుభవించి ప్రజలను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. బలహీనవర్గాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు. మన బిడ్డల చదువులు, దవాఖానల్లో చేరిన వారికి పైసా సాయం చేశారా? అని ప్రశ్నించారు. ఇప్పుడు ఎన్నికలు రాగానే మళ్లీ పల్లెలకు వస్తున్నారని.. నోట్లు పెట్టి ఓట్లు కొనుగోలుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. వాళ్ల మాయమాటలు నమ్మితే మన బతుకులు ఆగమవుతాయని చెప్పారు. ప్రజలు ఆలోచించాలని..ప్రగతి కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటేసి తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాగా, ఆయా కాలనీల్లో పుట్టమధూకర్, శైలజల ప్రచారానికి బ్రహ్మరథం పట్టారు. పూలదండలు, శాలువాలతో ఆత్మీయంగా సత్కరించారు. అంతకుముందు శ్రీ మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఎగోళపు శంకర్‌గౌడ్, జడ్పీటీసీ తగరం సుమలతా శంకర్‌లాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, కౌన్సిలర్లు గర్రెపల్లి సత్యనారాయణ, కొట్టే పద్మా రమేశ్, వీకే. రవి, శ్రీపతి బాణయ్య పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు..

కమాన్‌పూర్, నవంబర్ 3: కమాన్‌పూర్, పెంచికల్‌పేట్ గ్రామాలకు చెందిన పలువురు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేశారు. వీరికి పుట్ట మధూకర్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కిషన్‌రెడ్డి నాయకులు ఇనగంటి రామారావు, గడప కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

మంథని, నవంబర్ 3: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ అధికారులకు సూచించారు. శుక్రవారం మంథని ఆర్వో కార్యాలయాన్ని సందర్శించారు. హెల్ప్ డెస్క్, ప్రీ సర్టిఫికేషన్ డెస్క్, నామినేషన్ ఫారం మంజూరు డెస్క్ , కంప్యూటర్ డెస్క్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఆర్వో ఆఫీసుకు 100 మీటర్ల పరిధిలో ర్యాలీలకు అనుమతించ వచ్చదన్నారు. అంతకుముందు ఆర్వో ఆఫీసును జిల్లా ఆదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ సైతం సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశా రు. మంథని ఆర్వో హనుమానాయక్, ఏవో తూము రవీందర్, తహసీల్దార్ రాజయ్య పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే సమ సమాజం

- కేసీఆర్ పాలనలో సర్వ మతాలకు ప్రాధాన్యం
- మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్
- వేద మహాసభలకు హాజరు



మంథనిలోని నృసింహ శివ కిరణ్ గార్డెన్స్‌లో పుట్ట మధూకర్-శైలజను సన్మానిస్తున్న వేద పండితులు

మంథని, నవంబర్3 ఆధ్యాత్మిక చింతనతో సమ సమాజ నిర్మాణం సాధ్యమని మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలో సర్వ మతాలకు సమ ప్రాధాన్యం ఇచ్చారని కొనియాడారు. మంథనిలోని నృసింహ శివకిరణ్ గార్డెన్స్‌లో శ్రీ జనార్దన సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపార వేత్త గట్టు నారాయణగురూజీ సౌజన్యంతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వేద మహాసభల్లో శుక్రవారం పుట్ట మధూకర్ హాజరై మాట్లాడారు. కులమతాలకతీతంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యాత్మికతకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. మంథని ప్రాంతంలో ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. గట్టు నారాయణగురూజీకి ఈ ప్రాంతంపై ఉన్న ప్రేమతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఒక సమయంలో మజీదు నిర్మాణానికి రూ.50 వేలు అందించిన ఘనత ఆయనకే దక్కిందని కొనియడారు. తన హయాంలో మంథని గొప్పతనాన్ని, విశిష్టతతో పాటు ఆలయ భూములను రక్షిస్తూ ఆచారాలను కాపాడుకుంటూ ముందుకు వెళ్లామన్నారు. మంథనిలో ఆధ్యాత్మిక చింతన పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వేదాలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన మంథనిలో వేద పాఠశాల లేక పోవడంపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పుట్ట మధూకర్, మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజను వేద పండితులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు, వేద పండితులు పాల్గొన్నారు.